www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
29.01.2024
సంపుటి:2 సంచిక: 101

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



## సీఎంని కలిసిన ఐటీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ కమిటీ ప్రతినిధులు

మేడ్చల్, విశాల భారతి : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో ప్రభుత్వ ఐటీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధుల బృందం ఆదివారం కలిసి శాలువాతో సన్మానించారు. గత ప్రభుత్వ విధానం వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్ సురేందర్ నాయక్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా ఉన్న తమను మిగతా 2లో



## సంపద సృష్టించే వారికి.. ప్రభుత్వం ప్రోత్సాహం

- తెలంగాణను సంక్షేమ రాష్ట్రంగా మారుస్తాం
- బిల్డర్లను కాపాడుకునే బాధ్యత మాపై ఉంది
- వారిని ప్రభుత్వం కాంట్రాక్టర్లుగా చూడదు
- సంపద సృష్టించే సృష్టికర్తలుగా చూస్తోంది
- జాతి నిర్మాణానికి బిల్డర్ల కృషి భేష్
- పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం
- బిల్డర్స్ కన్వెన్షన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బిల్డర్లను కాంట్రాక్టర్లు గా చూడటం లేదని, సంపద సృష్టించే సృష్టికర్తలు గా చూస్తున్నదని, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 'సంపదను సృష్టించే సృష్టి కర్తలను కాపాడుకొని ప్రోత్సహించే బాధ్యత మాది' అని భరోసా ఇచ్చారు. ఆదివారం హైటెక్స్ లో జరిగిన బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 31వ కన్వెన్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 'భట్టి' హాజరయ్యారు. రెండో రోజు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు. కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్ ను పరిశీలించి వాటి తయారీ, ఉపయోగం గురించి అడిగి తెలుసుకున్నారు. "బిల్డింగ్ త్రూ టైం, టెక్నికల్ వాల్యూమ్" పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడారు. దేశంలో జరుగుతున్న నిర్మాణ రంగాల్లో తెలుగు రాష్ట్రాల కాంట్రాక్టర్ల కాంట్రిబ్యూషన్ ఎక్కువగా ఉన్నదని, దేశ సంపదను సృష్టించడంలో తెలుగు రాష్ట్రాల బిల్డర్స్ కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారిని ప్రోత్సహించడం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పారు. భారతదేశం ప్రజాస్వామిక, సంక్షేమ రాజ్యమని అన్నారు. ''దేశంలో సంక్షేమ రాజ్యం అమలు కావాలంటే సంపద కావాలని, సంపద సృష్టించే సంస్థలు వచ్చినప్పుడే ప్రజల సంక్షేమ అవసరాలను ప్రభుత్వాలు తీర్చగలవని అన్నారు.



సంపద సృష్టించేటు వంటి సంస్థలను గాయపరిచే ఆలోచన ఇందిరమ్మ రాజ్యంలో ఉండబోదని అన్నారు. నిర్మాణ రంగంలో వచ్చిన అనేక విప్లవాత్మక మార్పులతో దేశంలో నిర్మాణ రంగం చాలా ముందుకు దూసుకు పోతున్నదని భట్టి విక్రమార్క వివరించారు. బ్యాంకు గ్యారంటీ రుణాలు తెచ్చుకొని నిర్మాణ రంగంపై పెట్టుబడి పెట్టిన సంస్థలకు సకాలంలో బిల్లులు రాకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాడు మార్కెట్లో ఒక వెలుగు వెలిగినటువంటి ప్రముఖ నిర్మాణ రంగ సంస్థలు నేడు మిగతా 2లో

## రుణమాఫీ ఏమైంది?

- హామీలు అమలు చేయకుండా తప్పించుకుందామంటే కుదరదు
- డిక్లరేషన్ల పేరుతో దోకా • కేసీఆర్ లేకుండా తెలంగాణ వచ్చేదా
- రేవంత్ రెడ్డిది మేనేజ్ మెంట్ కోటా • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ తెలిపారు. రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయలేదు. రైతుబంధు కింద వారం రోజుల్లోనే రూ. 7,500 కోట్లు రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కేసీఆర్‌ది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. తెలంగాణ తెచ్చింది గులాబీ జెండానే. పోయింది అధికారం మాత్రమే.. పోరాట పటిమ కాదు. ప్రజల పక్షాన ప్రశ్నించడంలో కేసీఆర్ కంటే పదునైన గొంతు దేశంలో లేదు. రేవంత్ రెడ్డి ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి కాదు. ఢిల్లీ మేనేజ్‌మెంట్ కోటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా..? తెలంగాణ రాకుంటే సీఎం, డిప్యూటీ సీఎం పదవులు మీకు మిగతా 2లో





## పుట్టింటికి వచ్చి రాజకీయం చేస్తున్నా అది కూడా తప్పేనా?

వివరాలు 2లో

## బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

- ఇండియా కూటమికి షాకిచ్చిన జేడీయూ చీఫ్
- కన్వీనర్ పదవి వదిలి.. తిరిగి ఎన్డీయే గూటిలోకి..
- బీజేపీ సాయంతో మరోసారి సీఎం పీఠంపై నితీశ్
- బీహార్‌లో ఎక్కువ కాలం సీఎంగా రికార్డు



**విశాల భారతి, నేషనల్‌బ్యూరో:**


బీహార్‌లో మరో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. బీహార్ ముఖ్యమంత్రిగా తొమ్మిదోసారి నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో నితీశ్ కుమార్‌తో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ప్రమాణం స్వీకారం చేయించారు. ఇక, తొమ్మిదోసారి సీఎంగా ప్రమాణం చేసి దేశంలోనే నితీశ్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేశారు. అనంతరం, ఎనిమిది మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ నుంచి విజయ్ కుమార్ సిన్హా, సామ్రాట్ చౌదరి ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. జేడీయూ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ముగ్గురు, హిందూస్థాన్ ఆవామ్ మోర్చా నుంచి ఇద్దరు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే సుమిత్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ ప్రమాణ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరయ్యారు. కాగా, నితీష్ కుమార్ బీజేపీ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే కీలక పరిణామాలు.. ఆదివారం ఉదయం గవర్నర్‌ను కలిసిన నితీశ్ కుమార్ రాజీనామా లేఖ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాకూటమిలో పరిస్థితులు సరిగా లేవన్నారు. మిగతా 2లో

## ఇక రాజకీయాలకు గుడ్ బై

- వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను
- వ్యాపారాలు చూసుకుంటా
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు టార్గెట్ చేశాయి
- టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గల్లా జయదేవ్ కు కృతజ్ఞతాభివందనం పేరిట గుంటూరులో సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరయ్యారు. గల్లా జయదేవ్ రాజకీయాలకు తాత్కాలిక విరామం ప్రకటించారని, ఆయనకు టీడీపీ తలుపులు ఎప్పటికీ తెరిచే ఉంటాయని లోకేశ్ స్పష్టం చేశారు. వ్యక్తిత్వానికి మారు పేరు జయదేవ్ అని కొనియాడారు. సిద్ధాంతాల కోసం నిలబడే వ్యక్తి నేను. రాజకీయాల నుంచి తప్పుకుంటానే గానీ పార్టీ మారేది లేదు అని జయదేవ్ కరాఖండీగా చెప్పారు. ఇవాళ నిజంగా ఎంతో బాధపడుతున్నా. ఇంత దగ్గరయ్యామే.. ఎందుకు రాజకీయాలకు విరామం ప్రకటిస్తున్నాడు? విచారం కలిగింది. డెఫినెట్ గా జయదేవ్ ను మేం రాజకీయంగా మిస్ అవుతాం. రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి అనేదానిపై జయదేవ్ మనకు అన్నివేళలా అందుబాటులో ఉంటారు" అంటూ లోకేశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గల్లా జయదేవ్ మాట్లాడుతూ, తనకు రాజకీయ అవకాశం ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రజల గొంతుక వినిపించడానికి రాజకీయాల్లోకి వచ్చానని, కానీ రాజకీయ పరిమితుల వల్ల అటు కేంద్రంతో



పోరాడలేకపోతున్నానని, ఇటు వ్యాపార పరిమితుల వల్ల రాష్ట్ర ప్రభుత్వంపైనా మాటల దాడి చేయలేకపోతున్నానని గల్లా జయదేవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇవేవీ చేయకుండా, వాళ్లు వీళ్లు వాదించుకుంటుంటే చూస్తూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. తనను జైల్లో వేసినా ఫర్వాలేదు కానీ, నోరు మూసుకుని కూర్చోమంటే కూర్చోలేనని స్పష్టం చేశారు. వివాదాలు లేకుండా రాజకీయాలు చేయడం చాలా కష్టమైన పని అని గల్లా జయదేవ్ అభిప్రాయపడ్డారు. పార్ట్ టైమ్ గా వ్యాపారం చేసుకోవచ్చేమో కానీ, పార్ట్ టైమ్ గా రాజకీయాలు చేయలేమన్న విషయం అర్థమైందని అన్నారు. ఎలాంటి పోరాటాలు చేయలేనప్పుడు ప్రజల ముందుకు వచ్చి ఓటు అడగలేనని, పూర్తి స్థాయిలో రాజకీయాలు చేయాలనుకున్నప్పుడే మళ్లీ ప్రజల ముందుకు వస్తానని గల్లా జయదేవ్ స్పష్టం చేశారు.

## కేసీఆర్ ఉద్యమాలు అందరికీ ఆదర్శం



- ఆయనలా పట్టుదల, కార్యదీక్షతో ముందుకు సాగాలి
- మహిళా రిజర్వేషన్‌లో ఓబీసీలకు కోటా కల్పించాలి
- బీసీ కులగణన చేపట్టాలి
- మధ్యప్రదేశ్ లో నిర్వహించిన పీడిత్ అధికార్ యాత్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ కవిత

వివరాలు 2లో

## ఏవి పాలో.. ఏవీ నీళ్లో జనం గ్రహిస్తారు

- మేం కేసులు పెట్టి ఉంటే కాంగ్రెసోళ్లు జైల్లో ఉండేవారు
- గ్యారెంటీలు అమలు చేయకుండా బీఆర్ఎస్ పై ఆరోపణలు
- రేవంత్ సీఎం కుర్చీ .. కేసీఆర్ పెట్టిన భిక్ష
- మంత్రి హరీశ్ రావు కామెంట్లు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మెదక్ పార్లమెంటులోని 7 అసెంబ్లీల్లో 6 చోట్ల మనమే గెలిచాం, స్వల్పఓట్ల తేడాతోనే పద్మమ్మ ఓడిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఏది జరిగినా మన మంచి కేనని, ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అర్థమవుతోందన్నారు. ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయి, ఏవి పాలో, ఏవి నీళ్లో వారికి తేలిసిపోయిందన్నారు. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న హరీష్ రావు మాట్లాడుతూ.. జ్వరం వచ్చినా మెదక్ మీటింగ్ కదా అని ఓపిక చేసుకుని వచ్చానన్నారు. బడ్జెట్ లేదని తెలిసినా కాంగ్రెస్ ప్రజలను ఆశపెట్టి మోసం చేసిందని కీలక వ్యాఖ్యలు చేశారు.

### పాలన చేతకాక ప్రతిపక్షాలపై వేధింపులు

కాంగ్రెస్ ప్రచారంలో అబద్ధాలు, పాలనలో అసమర్థత కనిపిస్తోందని.. పాలించడం చేతగాక ప్రతిపక్షాలను వేధిస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలనే అమలు చేయాలని కోరుతుంటే అసహనంతో ప్రతిపక్షాలపై దాడులు చేయడం సరికాదని హితవు పలికారు. కేసులు పెట్టి బెదిరిస్తున్నారు. మేం





# సంపద సృష్టించే వారికి..
# ప్రభుత్వం ప్రోత్సాహం

**మొదటిపేజీ తరువాయి**

కనిపించకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వతహాగా నిర్మాణ రంగంలో రాణిస్తూ జాతి నిర్మాణానికి బిల్డర్స్ చేస్తున్న కృషిని వివరిస్తూ వారికి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ చాలా అందమైన పట్టణమని పెట్టుబడులకు అనువైన ప్రాంతమని వివరించారు. తెలంగాణ రాష్ట్రం వాతావరణ పరంగా, ఆర్థికపరంగా, భాషా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేశంలో ఉన్నటువంటి వారు ఇక్కడికి వచ్చి స్థిరపడి వ్యాపారాలు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని చెప్పారు. తెలంగాణకు వచ్చి సంపద సృష్టించే వారికి కావాల్సిన సహాయ సహకారాలు ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఎస్.ఎన్ రెడ్డి, చైర్మన్ బి.శ్రీనయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు చేసిన నిర్మాణ పనులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిందని దీంతో చాలామంది కాంట్రాక్టర్లు ఆర్థిక సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఇచ్చి రావాల్సిన బకాయిలను వీలైనంత త్వరగా ఇప్పించాలని కోరారు. ఇరిగేషన్ ప్రాజెక్టులో నిర్మాణం చేసే కాంట్రాక్టర్లకు కొన్ని పన్నుల నుంచి ఇచ్చే మినహాయింపు, రాయితీలను భవన నిర్మాణం కాంట్రాక్టర్లకు కూడా ఇవ్వాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ సచితానంద రెడ్డి, రాష్ట్ర చైర్మన్ దేవేందర్ రెడ్డి, కో వైస్ చైర్మన్ డీవీఎన్‌రెడ్డి, నేషనల్ కన్వెన్షన్ చైర్మన్ ఆర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# రుణమాఫీ ఏమైంది?

**మొదటిపేజీ తరువాయి**

దక్కేవా..? రేవంత్ రెడ్డి పలికేవన్నీ ప్రగల్భాలే. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పించుకునేందుకు రోజుకో అవినీతి కథ అల్లుతున్నారు. ఇక్కడ అవినీతి.. అక్కడ అవినీతి అని కథలు చెబుతున్నారు. అధికారం మీ చేతుల్లోనే ఉంది.. అవినీతిని వెలికితీయమనే చెబుతున్నాం. అవినీతి జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోండి. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తప్పించుకుంటే వదిలిపెట్టం అని కేటీఆర్ హెచ్చరించారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ కూడా నమ్మలేదు అని కేటీఆర్ తెలిపారు. డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మోసం చేశారు. కేసీఆర్ చెప్పిందే నిజమైందని ప్రజలు భావిస్తున్నారు. ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగం అయ్యాయి. ఫ్రీ బస్సు పథకంతో బస్సుల్లో యుద్ధాలు జరుగుతున్నాయి. ఏదైనా పథకం తెస్తే ఆలోచించి తేవాలి. గవర్నర్ ప్రసంగం అంతా అబద్ధాల పురాణం. శ్వేత పత్రం పెడితే.. ధీటుగా జవాబిచ్చాం. కేసీఆర్ పంపిన ముగ్గురు సైనికులే అసెంబ్లీలో అదరగొట్టారు. కేసీఆర్ ప్రతిపక్షంలో ఉంటేనే పవర్ ఫుల్. కాంగ్రెస్, బీజేపీ ములాఖత్ అయ్యాయి. మీ గురువులతోనే కాలేదు.. మీతో ఏం అవుతుంది..? రేవంత్ రెడ్డి కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోడు. సిరిసిల్ల నేతన్నలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

# ఏవి పాలో.. ఏవీ నీళ్లో జనం గ్రహిస్తారు

**మొదటిపేజీ తరువాయి**

కేసులు పెట్టి ఉంటే, సగం మంది కాంగ్రెస్ వాళ్లు జైళ్లలో ఉండేవారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. మెదక్ పార్లమెంటులోని అసెంబ్లీ స్థానాల్లో 6 చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించిందన్నారు. అంటే ప్రజలలో బీఆర్ఎస్ పైనే చాలా నమ్మకం ఉందని మెదక్ ప్రజలు నిరూపించారని చెప్పారు. కర్ణాటకలో 5 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 8 నెలలు దాటినా హామీలను అమలు చేయలేదని హరీష్ రావు ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ గెలిచే పరిస్థితి లేదని అక్కడి ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పు చెప్పారు, 6 నెలల దాటితే స్థానిక ఎన్నికలు వస్తాయి. ప్రజలే మనల్ని వెతుక్కుని మరీ ఓటు వేస్తారని హరీష్ రావు కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లుగా ఉచిత కరెంటు రావడం లేదు కదా.. మోటర్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయంటూ హరీష్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కరెంట్ మోటార్లను రిపేర్ చేసే వ్యాపారం పెరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. జనరేటర్ల వ్యాపారం పెరిగిందని, కాంగ్రెస్ తెచ్చిన మార్పు ఇదే అన్నారు. రేవంత్ రెడ్డికి సీఎం కుర్చీ కేసీఆర్ బెట్టిన భిక్ష అని, ఎవరికైనా పదవి వస్తే బాధ్యత పెరగాలని భావిస్తాం. కానీ రేవంత్ సీఎం పదవిని కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఇది సబబు కాదన్నారు. రైతుబంధు 15



వేలకు పెంచలేదు. పదివేలు కూడా సరిగ్గా రావడం లేదు. 2లక్షల రైతు రుణమాఫీ చేయలేదు. పింఛన్ 4 వేలు పెరగలేదు. వడ్లకు బోనస్ పెరగలేదున్నారు. మహిళలకు 2500 రాలేదు. అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా పింఛన్ పెంచలేదు. పింఛన్ పెంచడానికి ఏ ప్రక్రియ కూడా అసరం లేకపోయినా ఎందుకు పెంచడం లేదు? అని హరీష్ రావు ప్రశ్నించారు. వందరోజుల్లో హామీలు నెరవేర్చకపతే కర్రు కాల్చి వాతపెడతారన్నారు. 2 రెండు లక్షల రుణమాఫీ చేయకుండా పార్లమెంటు ఎన్నికలకు వెళ్తే ప్రజలు ఓటు వేయరని కాంగ్రెస్ కు అర్థం కావడం లేదన్నారు.

### ఎలక్షన్ కోడ్ రాకముందే హామీలు అమలు చేయాలి

పార్లమెంటు ఎన్నికల కోడ్ రాకముందే కాంగ్రెస్ హామీలను నిలబెట్టుకుని చిత్తశుద్ధి నిరూపించుకోవాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. మేం ఎన్నికల మేనిఫెస్టోలో ఇవ్వని హామీలను కూడా అమలుచేశాం. కాళేశ్వరం నీళ్లు తెచ్చి రైతుల కాళ్ళు కడిగామని వ్యాఖ్యానించారు. ఇంటింటికి మంచినీళ్లు, 11 లక్షలమంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, రైతు బంధు హామీలను ఎన్నికల్లో ఇవ్వకపోయినా అమలు చేశామన్నారు. కరోనా కష్టసమయంలో సైతం ప్రభుత్వం దగ్గర పైసల్లేకపోయినా బిల్లులు, ఎమ్మెల్యల జీతాలు ఆపి రైతుంబంధు ఇచ్చాం. ఇప్పుడు ఏ సమస్యా లేకపోయినా కాంగ్రెస్ ఎందుకు ఇవ్వడం లేదు? అని తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రేవంత్ పాలనను కేసీఆర్ పాలనతో పోల్చి చర్చలు పెట్టండి. కాంగ్రెస్ దళితబంధు పక్కన పెట్టింది. గొల్లకుర్మలకు గొర్రెలు ఇవ్వడం లేదు, 2 లక్షల సాయం కూడా అందలేదు. కేసీఆర్ ప్రారంభించిన పనులను అడ్డుకుంటున్నారు. వచ్చిన నిధులను వెనక్కి పంపుతున్నారు. ఇదేనా అభివృద్ధి? పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి పనిచేసి మెదక్‌లో భారీగా ఓట్లు వేయిద్దాం. పద్మమ్మ ఓడిపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. కాంగ్రెస్ హామీలపై చర్చ పెట్టాలి. ఇచ్చిన హామీలు అమలు చేసేదాక ప్రభుత్వం మెడలు వంచుతాం. అసెంబ్లీలో ప్రజల పక్షాన కొట్లాడుతాం. కార్యకర్తలు అధైర్యపడొద్దు. చీకటి తర్వాత వెలుగు వస్తుంది. మెదక్‌లో గులాబీ జెండా ఎగరేస్తాం' అన్నారు హరీష్ రావు.

# బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

**మొదటిపేజీ తరువాయి**

అందుకే 'మహాఘట్ బంధన్' నుంచి బయటకొచ్చినట్లు ప్రకటించారు. త్వరలో కొత్త కూటమిని ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో నితీశ్ కుమార్ బీహార్‌సీఎంగా తిరిగి ప్రమాణం చేశారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆర్జేడీ - కాంగ్రెస్ కూటమి నుంచి వైదొలిగిన జేడీయూ.. బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జనతా దళ్ తిరిగి ఎన్డీయే గూటికి చేరడాన్ని ఇండియా కూటమికి షాక్‌గా చెప్పొచ్చు. ఓ దశలో నితీశ్ కుమార్ ఇండియా కూటమి కన్వీనర్ పదవిని ఆశించారు. కానీ అది సాధ్యం కాలేదు. బీహార్‌లో అత్యధిక కాలం సీఎం పదవిని చేపట్టిన నేతగా నితీశ్ కుమార్ గుర్తింపు పొందారు. దాదాపు 20 ఏండ్లుగా ఆయన బీహార్‌సీఎం పదవిలో కొనసాగుతున్నారు. అయితే సీఎం పీఠాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆయన తరచుగా కూటములను మారుస్తున్నారు. తన పార్టీ జేడీయూకి.. బీజేపీ, ఆర్జేడీల కంటే తక్కువ సీట్లే వస్తున్నప్పటికీ.. తెలివిగా ఆ పార్టీలను వాడుకుంటూ ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగుతూ వస్తున్నారు. బీహార్ అసెంబ్లీలో 243 సీట్లు ఉండగా.. లాలూ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలోని ఆర్జేడీ 79 సీట్లు గెలుచుకోగా.. జేడీయూ 45 ఎమ్మెల్యేలను గెలుపొందింది. బీజేపీ 78 స్థానాల్లో గెలవగా.. సీపీఐ(ఎంఎల్) 12 స్థానాల్లో గెలవగా.. కాంగ్రెస్ పార్టీ 19 స్థానాల్లో విజయం సాధించింది. హెచ్ఏఎం (ఎస్)కు నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా.. మజ్లిస్ 1, సీపీఐ(ఎం) 2, సీపీఐ 2, ఇండిపెండెంట్ 1 చొప్పున ఎమ్మెల్యేలు ఉన్నారు. బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు 122 సీట్లు అవసరం. రెండు పార్టీల కలయికతో సభ్యుల సంఖ్య 123కు చేరింది.



# పుట్టింటికి వచ్చి రాజకీయం చేస్తున్నా అది కూడా తప్పేనా?

- జగన్ కు వైఎస్‌కు అసలు పోలికే లేదు
- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:**

'నా పుట్టింటికి వచ్చి రాజకీయం చేస్తున్నా. ఎంతటి త్యాగానికైనా.. పోరాటానికైనా సిద్ధం' అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా ఆమె కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'వైఎస్ఆర్, జగనన్న పాలనకు ఆకాశం, పాతాళానికి ఉన్నంత తేడా ఉంది. హంద్రీనీవా ప్రాజెక్టును వైఎస్ఆర్ 90శాతం పూర్తి చేశారు. మిగిలిన 10శాతం పూర్తి చేయడానికి జగనన్నకు సాధ్యం కాలేదు. గాలేరునగరి ప్రాజెక్టులో మిగిలిన 50శాతం పనులూ పూర్తి చేయలేదు. మరి జగన్.. రాజశేఖర్‌రెడ్డి వారసుడు ఎలా అవుతారు? మాట తప్పిన జగన్ ప్రజలకు ఏం జవాబు చెబుతారు?వైకాపాను భుజాన వేసుకొని 3,200కి.మీ పాదయాత్ర చేసి పార్టీని నిలబెట్టా. కృతజ్ఞత లేకుండా వ్యక్తిగత జీవితంపై దాడి చేస్తున్నారు. పులి కడుపున పులే పుడుతుంది. నేను భయపడను''అని అన్నారు. బీజేపీ పై కూడా షర్మిల విమర్శలు గుప్పించారు. రామమందిరం కట్టిన మోడీ తిరుపతిలో ఇచ్చిన మాట తప్పారని, ఏపీలో మోడీ కేడీగా నిలిచిపోయారని ధ్వజమెత్తారు. బీజేపీకి మద్దతు పలుకుతున్న జగన్ కూడా కేడీనేనని వ్యాఖ్యానించారు.



# హౌసింగ్ బోర్డు కార్యదర్శిగా ముజీబ్

### వెల్లడించిన ప్రెసిడెంట్‌స్వామి గౌడ్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్‌ను తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ బోర్డ్ సొసైటీ, గచ్చిబౌలి కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సొసైటీ అధ్యక్షుడు కనకమామిడి స్వామి గౌడ్ తెలిపారు. ఆదివారం జరిగిన బోర్డ్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం డా. ముజీబ్‌మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకానికి రాబోయే రోజుల్లో సొసైటీని మరింత అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర వహిస్తానని, సొసైటీ అధ్యక్షుడు, కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

# కేసీఆర్ ఉద్యమాలు అందరికీ ఆదర్శం




**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేసిన ఉద్యమాలు అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్ స్ఫూర్తితో ఓబీసీ హక్కుల సాధన ఉద్యమం సాగాలని.. ఆయనలాగ పట్టుదలతో, కార్యదీక్షతో చేసే ప్రతి ఉద్యమం ఫలితాన్ని ఇస్తుందని పేర్కొనానారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ని ఆదర్శంగా తీసుకొని ఓబీసీ హక్కుల కోసం మధ్య ప్రదేశ్ లో పోరాటాన్ని మొదలుపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలన్నారు. బీసీ కులగణన చేపట్టాలని, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టం పోస్ట్ డేటెడ్ చెక్కు వంటిదని విమర్శించారు. కేంద్రంలో ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

### పీడిత్ అధికార్ యాత్ర..

మధ్యప్రదేశ్ లోని దతియా జిల్లా కేంద్రం నుంచి ఓబీసీ హక్కుల ఫ్రంట్ వ్యవస్థాపకుడు దామోదర్ సింగ్ యాదవ్ చేపట్టిన "పీడిత్ అధికార్ యాత్ర" ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దతియలో ఓబీసీ ఫ్రంట్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం పలికారు. యాత్రను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి మొదటిసారి రావడం సంతోషంగా ఉందన్నారు. ఆ రాష్ట్రానికి చెందిన ఝాన్సీ రాణి, అవంతిబాయి వంటి పోరాటయోధులు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఇదే రాష్ట్రానికి చెందిన ఓబీసీ మహిళా ఉమా భారతి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, జాతీయ స్థాయిలో కీలక నాయకురాలిగా ఎదిగారని కవిత ప్రస్తావించారు.



# సీఎంని కలిసిన ఐటీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ కమిటీ ప్రతినిధులు

**మొదటిపేజీ తరువాయి**

గత రాష్ట్ర పాలకులు క్రమబద్ధీకరించకపోవడంతో తమ బ్రతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిఐ ఒప్పంద ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని భవిష్యత్తులో ఐటిఐ ఒప్పంద ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల న్యాయం చేస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో చాలీచాలని వేతనాలకు సేవలు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటిఐ ఒప్పంద ఉద్యోగులకు న్యాయం చేయాలని రేవంత్ రెడ్డి ను సీఎం. రేవంత్ రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్ సురేందర్ నాయక్, ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.

# నాగోరే.. నాగోబా..

**• హస్తినమడుగు నుంచి కదిలిన శ్వేతనాగుల దండు..**
**• అభయారణ్యంలో మెస్రం • వంశీయుల మహా పాదయాత్ర..**



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

నాగశేషుడిని పూజించే మెస్రం వంశీయుల అతి పెద్ద జాతర నాగోబా ప్రధాన ఘట్టం కీలక దశకు చేరుకుంది. కెస్లాపూర్ ఆలయం నుంచి ప్రారంభమైన గంగా జల సేకరణ మహా పాదయాత్ర హస్తినమడుగుకు చేరింది. నిమయ నిష్టలతో రాళ్లు రప్పలు దాటుతూ కొండ కోనల్లో శ్వేత నాగులా కదిలి మెస్రం వంశీయులు గోదావరిలోని హస్తినమడుగుకు చేరుకుని పుణ్య గోదావరికి ప్రత్యేక పూజలు నిర్వహించి గంగాజలాన్ని సేకరించారు. అమావాస్య అర్ధరాత్రి నాగశేషుడికి ఈ పవిత్ర గంగాజలాన్ని అభిషేకించడంతో ఫిబ్రవరి 9 న నాగోబా మహా జాతర ప్రారంభం కానుంది. ఐదు మండలాలు, 18 గ్రామాలు, 26 మారుమూల గ్రామాల మీదు సాగుతున్న మెస్రం వంశీయుల గంగాజల మహా పాదయాత్రపై టీవీ9 స్పెషల్ రిపోర్ట్.

శ్వేత నాగులా కదిలే రూపం.. తెల్లని వస్త్రం.. దట్టమైన కవ్వాల్ అభయారణ్యం గుండా పదిరోజుల పాటు సాగుతున్న మహా పాదయాత్ర.. చూసేందుకు రెండు కనులు చాలవు అన్నట్టుగా మంత్ర ముగ్ధులను చేస్తోంది. అదే మేస్రం వంశీయుల గంగాజల సేకరణ మహా పాదయాత్ర. ఈనెల 21 కెస్లాపూర్ నాగోబా ఆలయం నుండి ప్రారంభమైన ఈ పాదయాత్ర.. 110 కిలోమీటర్లు దట్టమైన అడవుల గుండా సాగి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగులోని గోదావరి హస్తినమడుగుకు చేరుకుంది. పుణ్య గోదావరికి ప్రత్యేక పూజలు చేసి పవిత్ర గంగా జలాన్ని సేకరించారు మెస్రం వంశీయులు. కాలికి పాదరక్షలు ధరించకుండా.. అత్యంత నియమనిష్టలతో సాగే ఈ గంగా జల పాదయాత్ర ఈనెల 5 న ఇంద్రవెల్లిలోని ఇంద్రదేవి ఆలయానికి చేరుకోనుంది. ఇంద్రాయి దేవత పూజ అనంతరం సకుటుంబ సపరివార సమేతంగా కెస్లాపూర్ లోని మర్రి చెట్టు వద్దకు చేరుకుంటారు మేస్రం వంశీయులు. ఈ ఘట్టంతో నాగోబా జాతరకు అంకురార్పణ జరుగుతుంది. ప్రతి ఏడాది పుష్యమాస ఆరంభం నుండి ప్రారంభమయ్యే నాగోబా జాతర వేడుకలు.. మేస్రం వంశీయులకే కాదు ఆదివాసీ సమాజానికి కీలకమైన పండుగ. చెట్టుకొకరు పుట్టకొకరుగా ఉన్న ఆదివాసీ సమాజాన్ని ఐక్యం చేసే మహా జాతరగా నాగోబాకు ప్రత్యేక స్థానం ఉంది.

నాగోబా జాతర ప్రపంచంలోని అతిపెద్ద గిరిజన జాతరల్లో ఒకటి. సర్పజాతిని పూజించడమే ఈ పండగ ప్రత్యేకత. పుష్యమాస అమావాస్య అర్ధరాత్రి వేళ నాగశేషుడికి గంగాజలాభిషేకంతో ఈ జాతర ప్రారంభం అవుతుంది. ఆదివాసీల ఆరాధ్య దైవమైన నాగోబా (శేషనారాయణమూర్తి) ఆ నిమిషాన పురివిప్పి నాట్యం అడుతాడని గిరిజన మెస్రం వంశీయుల అపార నమ్మకం. పుష్య మాస అమావాస్య నాడు సరిగ్గా సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నాగోబా ఆలయంలో గిరిజన పూజారులకు తమ ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడనీ.. వారందించే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్యమవుతాడని గిరిజనుల విశ్వసిస్తారు.

రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతరలో మెస్రం వంశీయుల పూజలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ పర్యవేక్షణలో 22 కితల వారు తమకు కేటాయించిన బాధ్యతలు నిర్వహిస్తారు. ఇందులో పటేల్, కటోడ, గాయికి, జాడియల్, నాయక్‌వాడి, సాంకేపాయిలాల్, ఎంపాలియల్, వాడే, సపాలి, ప్రధాన్, బేజిలికర్, హవాల్దార్, డివేకర్, ఎవితి, కోర్మార్, దప్, డాకలి, రంకం, బండే, బొడ్డిగూడియల్, గారుడి, కాంటేలకార్ కితలు ఉంటాయి. జాతర ప్రారంభం నుంచి మహాపూజ ముగింపు వరకు వీరంతా ఆలయ సమీపంలోని ప్రత్యేక గుడారాల్లో బస చేస్తూ మహాకార్యంలో భాగస్వాములవుతారు. పటేల్.. మహాపూజతో మొదలైన పూజ కార్యక్రమాలన్నీ ఈయన ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి.

ఈ ఏడాది నాగోబాను అభిషేకించేందుకు గంగా జలాన్ని సేకరించిన మెస్రం వంశీయులు నేడు తిరిగి కెస్లాపూర్ నాగోబా వైపు తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మహా పాదయాత్రను ప్రారంభించారు. ఈనెల 9 న అమావాస్య అర్ధరాత్రి నాగశేషుడికి గంగా జలాన్ని అభిషేకించి జాతర ప్రారంభిస్తారు మెస్రం వంశీయులు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం కెస్లాపూర్ నాగోబా ఆలయం నుండి ప్రారంభమైన గంగాజల పాదయాత్ర.. ఐదు మండలాలు, 18 గ్రామాలు , 26 మారుమూల గ్రామాల మీదు గా దట్టమైన కవ్వాల్ అభయారణ్యం గుండా సాగి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగులోని గోదావరి హస్తినమడుగు వరకు చేరింది. ఈ పాదయాత్ర సందర్బంగా మేస్రం వంశీయులకు ఘన స్వాగతం పలికి వారికి సేవలు చేసుకోవడం ఆదివాసీ గ్రామాల ఆచారం. ఈ ఏడాది నాగోబా మహాలయం నుండి ప్రారంభమైన గంగా జలం యాత్ర కేస్లాగూడ, గుంజాల , నాగల్ కొండ, గౌరి, గుమ్మూర్ , ఇస్లాంపూర్ , మల్లాపూర్ మీదుగా జన్నారం మండలంలోని గోదావరి నదిలోని హస్తినమడుగుకు చేరుకుంది. ప్రతి ఏడాది తమ మార్గాన్ని మార్చుకుంటూ సాగడం మేస్రం వంశీయులు ఆచారం. తమ సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఆదివాసీలను ఐక్యం చేసేందుకు ఈ పాదయాత్ర తోడ్పడుతుందని భావిస్తారు మేస్రం వంశీయులు. తొమ్మిది తెగలను ఏకం చేసే జాతర కూడా నాగోబానే. పది రోజులకు పైగా జరిగే గంగా జలాల సేకరణ మహాపాద యాత్ర.. ఈనెల 5 న తిరిగి కేస్లాపూర్ కి చేరుకుంటుంది. ఈనెల 21 న 110 మంది మెస్రం వంశస్తులు కెస్లాపూర్ లో కంకణం కట్టుకొని ఈ పాదయాత్రకు బయలుదేరారు. గోదావరి పూజ అనంతరం తిరుగు పయనమైన మేస్రం వంశీయులు ఈనెల 5న ఇంద్రవెల్లి మండలంలోని ఇంద్ర దేవి పూజ అనంతరం తిరిగి నాగోబా ఆలయానికి చేరుకుంటారు.


# జగన్ వెంట నడవనున్న విజయమ్మ..?

**• అన్నచెల్లెల మధ్య యుద్ధం • విజయమ్మతో చర్చించిన వైసీపీ అధిష్టానం**
**• సానుకూలంగా స్పందించిన విజయమ్మ**

**అమరావతి, విశాలభారతి :**



రాష్ట్రంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు షర్మిల రూపంలో పెద్ద సవాలే ఎదురవుతోంది. ఒకపక్క ప్రతిపక్షాలు చేసే విమర్శలకు సమాధానాలు చెప్పడంతోపాటు మరోపక్క జగన్ చెల్లెలు షర్మిల సంధించే బాణాలకు కూడా స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయపరమైన విమర్శలకు పార్టీ నాయకులు సమాధానం చెప్పేందుకు వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారు. కానీ, షర్మిల చేస్తున్న కుటుంబపరమైన విమర్శలు, ఆరోపణలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ఆ కుటుంబ సభ్యులుపైనే ఉంటుంది. షర్మిల చేస్తున్న ఆరోపణలపై సీఎం జగన్ స్పందిస్తే షర్మిలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించినట్టు అవుతుంది. ఈ నేపథ్యంలో వైసీపీ షర్మిలను రాజకీయంగా, వ్యక్తిగతంగా ఎదుర్కొనేందుకు వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఇప్పటికే రాజకీయ విమర్శలను ఎక్కుబెట్టిన షర్మిల.. తాజాగా కుటుంబ పరమైన విమర్శలు, ఆరోపణలను తీవ్రతరం చేసింది. ఇవన్నీ వైసీపీని ఇరకాటంలో పెట్టేలా ఉంటున్నాయి. దీంతో అప్రమత్తమైన వైసీపీ అధిష్టానం షర్మిలకు చెక్‌పెట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో అన్నా, చెల్లెలు మధ్య సాగుతున్న రాజకీయ రణక్షేత్రాన్ని ఏ తల్లి కూడా స్వాగతించదు. కానీ, వైఎస్ విజయమ్మకు ఈ పరిస్థితి ఏర్పడింది. షర్మిల కుటుంబ విషయాలను రోడ్డు మీదకు వచ్చి ఆరోపణలు చేస్తుండడంతో జగన్ తన తల్లి వద్ద ఇదే విషయాన్ని ప్రస్తావించినట్టు చెబుతున్నారు. తాను షర్మిలపై విమర్శలు చేయడం కంటే.. నువ్వే బయటకు వచ్చిన వాస్తవాలను చెప్పాలని కోరినట్టు చెబుతున్నారు. అదే సమయంలో పార్టీకి అండగా వచ్చే ఎన్నికల్లో ప్రచారాన్ని నిర్వహించా ల్సిందిగా సీఎం జగన్‌తోపాటు ఇతర కుటుంబ సభ్యులు విజయమ్మను కోరినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై విజయమ్మ సానుకూలంగా స్పందించారని చెబుతున్నారు. మంచి ముహూర్తం చూసి పార్టీ కోసం ప్రచారాన్ని నిర్వహిస్తారు. ఈ ప్రచారంలోనే వైఎస్ షర్మిల సీఎం జగన్‌పై చేస్తున్న అనేక విమర్శలు, ఆరోపణలకు విజయమ్మ సమాధానం చెబుతారని భావిస్తు న్నారు. విజయమ్మను బరిలోకి దించడం ద్వారా రాజకీయంగా, వ్యక్తిగతంగా జగన్‌పై చేస్తున్న అనేక విమర్శలకు సమాధానం చెప్పినట్టు అవుతుందని వైసీపీ నాయకులు భావిస్తున్నారు. తల్లి, చెల్లిని చూడలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలను ఏం చూస్తాడంటే చంద్రబాబు, పవన్ చేస్తున్న విమర్శలకు, తనకు అన్యాయం చేశాడంటూ షర్మిల మాట్లాడుతున్న మాటలకు విజయమ్మను రాజకీయ రణక్షేత్రంలో దించడం ద్వారా సమాధానం చెప్పినట్టు అవుతుందని వైసీపీ భావిస్తోంది. విజయమ్మతో సభలు, సమావేశాలు నిర్వహించడంతోపాటు అనేక ప్రాంతాల్లో సమావేశాలు పెట్టించేందుకు వైసీపీ సమాయత్తమవుతోంది. కూతురు, కొడుకు మధ్య జరుగుతున్న పోరును చూసి తీవ్ర ఆవేదన చెందుతున్న విజయమ్మను.. ఈ మేరకు ఒప్పించడంలో వైవీ సుబ్బారెడ్డ, ఆయన సతీమణితో పాటు వైఎస్ కుటుంబ సభ్యులు కీలకంగా వ్యవహరించినట్టు చెబుతున్నారు. షర్మిల రాకతో వైసీపీకి తగిలిన రాజకీయ డ్యామేజీని విజయమ్మ ద్వారా కొంతలో కొంతైనా పూడ్చుకునే ప్రయత్నాలను వైసీపీ చేస్తోంది. ఇవి ఎంత వరకు సత్ఫలితాలను ఇస్తాయో చూడాల్సి ఉంది.



## కృష్ణా నదిలో మునిగి ముగ్గురు మృతి

**తాడేపల్లి పోలిస్ స్టేషన్లో ఘటన**
**ఈతకు వెళ్లిన నాలుగురు విద్యార్థులు**

**అమరావతి, విశాలభారతి:**

కృష్ణానదిలో మునిగి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణానదిలో చోటు చేసుకుంది. సరదాగా స్నానానికి దిగడం కోసమని నదిలో దిగడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులు పటమటకు చెందిన నడుపల్లి నాగ సాయి కార్తికేయ, కత్తి ప్రశాంత్ (13), ఇంటర్మీడియెట్ విద్యార్ధి గగన్ గా గుర్తించారు. కాగా నదిలో స్నానానికి నలుగురు వెళ్లగా.. ఒకరు ప్రాణాలతో బయటపడ్డాడు. ముగ్గురు మృతి చెందారు. స్నానానికి వెళ్లకుండా నది ఒడ్డుపై ఉన్న కానూరు సనత్ నగర్ చెందిన షేక్ షారుక్ ప్రాణాలు దక్కించుకోగలిగాడు. కాగా.. నదిలో చనిపోయిన ముగ్గురు మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. మృతులందరూ పడమట హైస్కూల్ రోడ్డులోని నారాయణ స్కూల్ లో ఎనిమిదో తరగతి చదువుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న తాడేపల్లి పోలీసులు.. విచారణ చేపట్టారు.

## సెర్ప్ జిల్లా అధ్యక్షునిగా రణపంగ వెంకన్న

**సూర్యాపేట, విశాలభారతి:**



తెలంగాణ సెర్ప్ (ఎల్ 3) ఉద్యోగుల సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా కేంద్రం లో జరిగిన సెర్ప్ ఉద్యోగుల సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా సూర్యాపేట ఎపిఎంగా పని చేసున్న రణపంగ వెంకన్న ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రెమిడాల దుర్గాప్రసాద్ (ఎపిఎం), ప్రధాన కార్యదర్శిగా పొడిశెట్టి నరసయ్య గౌడ్ (ఎపిఎం), కోశాధికారిగా పబ్బతి లక్ష్మి( ఎపిఎం)సంయుక్త కార్యదర్శిగా శ్రీరాముల చంద్రశేఖర్ (ఎపిఎం)ను ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం గురించి ప్రతి నిత్యం వారికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి**

**మహబూబాబాద్ ,విశాల భారతి:**



ప్రభుత్వ భూమిలో గుడి సెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు స్థలాలను క్రమబద్ధీకరించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవి శివారులో జరిగిన గుడిసె వాసుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల తమ పాలనలో పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు మంజూరి చేయకపోవడం, విలువైన ప్రభుత్వ భూములను కొంతమంది అధికార పార్టీ నాయకుల అండదండలతో కాజేయడంతో వారి ఆగడాలను అరికట్టే పోరాటాలు నిర్వహిస్తూ, కమ్యూనిస్టు పార్టీలే ప్రభుత్వ స్థలాలను గుర్తించి అట్టి స్థలాలలో అర్హులైన పేదలతో గుడిసెలు వేయించడం జరిగినదని వాటిని నూతన ప్రజా ప్రభుత్వం గుర్తించి అర్హులైన పేదలకు స్థలాలను క్రమబద్ధీకరించి ఇందిర ఇండ్లు మంజూరి చేయించాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల సంక్షేమ పథకాల హామీలను అమలు చేసి పేదల ప్రజా ప్రభుత్వంగా ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న కన్నె వెంకన్న బుర్ర సమ్మయ్య తురక రమేష్ బూర్గుల కృష్ణ కొరియాల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ బిల్డప్ బాబాయ్.. చంద్రబాబు విమర్శనాస్త్రాలు

**కర్నూలు సభలో పాల్గొన్న చంద్రబాబు • జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం • వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసింది శూన్యం**

**అమరావతి, విశాలభారతి:**

కర్నూలు జిల్లా పత్తికొండలో నిర్వహించిన 'రా కదలిరా' కార్యక్రమం బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శనాస్త్రాలు సంధించారు. జగన్‌కు సబ్జెక్టు ఏమీ లేదని, బిల్డప్పులు మాత్రమే ఇస్తున్నారంటూ దుయ్యబట్టారు. 2019 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ గెలిచిందని.. కానీ ఒక్క అభివృద్ధి కూడా జరగలేదని అలాంటప్పుడు ఈ ప్రభుత్వం ఎందుకని నిలదీశారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ఓట్లు అడిగేందుకు జగన్ మళ్లీ వస్తాడని.. అప్పుడు నువ్వు మా బిడ్డ కాదు, క్యాన్సర్ గడ్డ అని చెప్పి తరిమికొట్టండని పిలుపునిచ్చారు. బీసీ ఓట్లతో గద్దెనెక్కిన జగన్ బీసీలకు ఏమీ చేయలేదని.. కేసీ క్రిష్ణమూర్తి లాంటి ఎందరో బీసీ నాయకులకు పదవులిచ్చి తాము బీసీలకు పెద్దపీట వేశామని చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లాలో పనులు లేక ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని.. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి వలసలను నివారిస్తామని హామీ ఇచ్చారు. ఒక బీసీని చంపిన వ్యక్తులు రోడ్లపై తిరుగుతున్నారని, బాధిత కుటుంబాన్ని జగన్ పరామర్శించలేదని, జగన్ బీసీల ద్రోహి అని ధ్వజమెత్తారు. బాబాయ్‌ని చంపిన వారు బయట తిరుగుతున్నారని ఆరోపించారు. వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వైసీపీ పాలన పోవడానికి కేవలం 73 రోజులే ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా యువత 'రా కదలిరా' కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వస్తున్నారని.. తాము అధికారంలోకి వస్తే యువత భవిష్యత్తుకు బంగారు బాట వేస్తానని చెప్పారు. తిరుపతిలో ఇండియా టుడేతో మీటింగ్ పెట్టి జగన్ కోట్లు ఖర్చు పెట్టి బిల్డప్ ఇచ్చారని చంద్రబాబు విమర్శించారు. బీకామ్ అంటే ఏంటో చెప్పలేని పరిస్థితిలో మొద్దబ్బాయి ఉన్నారని సెటైర్లు వేశారు. పేద ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూశారే తప్ప.. వారికి చేసిందేమీ లేదన్నారు. వైనాట్ 175 అంటున్న జగన్.. ముందు పులివెందులలో గెలిచి చూపించమని ఛాలెంజ్ చేశారు. ఎన్నికల ముందు ఏ పార్టీ అయినా యాక్టివ్‌గా ఉంటుందని.. కానీ వైసీపీ మాత్రం స్తబ్ధతగా ఉందని.. ఎమ్మెల్యేలు, మంత్రులను మార్చుతూ పబ్బం గడుపుతోందని అన్నారు. ఎన్నికల తర్వాత జగన్ జెండాను మడిచిపెట్టేందుకు.. వైసీపీ వాళ్లే సిద్ధంగా ఉన్నారని అన్నారు. రూ. 365 కోట్లతో జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టు తాము చేపడితే.. వైసీపీ ప్రభుత్వం దాన్ని మూలన పడేసిందన్నారు. 95 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలిచ్చానని, మళ్లీ ఇస్తానని మాటిచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. విండ్ ఎనర్జీ, సోలార్ ప్రాజెక్టులు నిర్మించి కరెంటు చార్జీలను తాను తగ్గిస్తే.. జగన్ ఇష్టానుసారంగా కరెంటు చార్జీలు పెంచాడని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సోలార్ ఎనర్జీ పరికరాలు ఇస్తామని.. దీనివల్ల కరెంటు ఉత్పత్తి చేసి, రైతులు అవసరానికి వాడుకోగా మిగిలిన కరెంట్‌ను కొనుగోలు చేస్తానని చెప్పారు. నాసిరకం మద్యంతో జగన్ ప్రజల రక్తంను తాగుతున్నాడని తూర్పారపట్టారు. హంద్రీనీవా ద్వారా ఆయకట్టుకు నీరిచ్చే బాధ్యత తనదేనని, గోదావరి నీళ్లు రాయలసీమకు తేవాలన్నదే తన సంకల్పమని చంద్రబాబు అన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
4
సోమవారం,
29.01.2024
హైదరాబాద్

# 29న ఛలో కలెక్టరేట్

**● మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి ● పెండింగ్ లో ఉన్న డైట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి**
**● జిల్లాలో నూతన వసతి గృహాలు ఏర్పాటు చేయాలి ● పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ మెనూ అందించాలి**

**మహబూబాబాద్ ,విశాలభారతి:**

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆద్వర్యంలో జనవరి 29న పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్, రీయింబర్స్మెంట్ విడుదల చేయాలనీ, మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలనీ , పెండింగ్లో ఉన్న డైట్ బిల్లులు విడుదల చేయాలని ఛలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ మరిపెడ డివిజన్ కార్యదర్శి గందసిరి జ్యోతి బసు తెలిపారు. కురవి జరిగిన ముఖ్య సమావేశానికి ఆయన అతిథిగా పాల్గొన్ని ఆయన ప్రసంగిస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంతో కలిపి 7800 కోట్ల రూపాయల పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాలున్నాయనీ, తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థుల మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలనీ, పెండింగ్ లో ఉన్న డైట్ బిల్లులు విడుదల చేయాలనీ, జిల్లాలో నూతన వసతి గృహాలు ఏర్పాటు చేయాలనీ, పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ మెనూ అందించాలని జనవరి 29న ఛలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 3 సంవత్సరాలుగా ట్యూషన్ ఫీజులు రాని కారణంగా విద్యార్థులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారనీ, ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. డైట్ బిల్లులు సకాలంలో చెల్లించాలనీ కోరారు. ఛలో కలెక్టరేట్ కు వేలాదిగా విద్యార్థులు తరలిరావాలనీ, ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కురవి మండల కార్యదర్శి వీరెందర్, నాయకులు మహేష్,నవీన్, ప్రవీణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి**



**మహబూబాబాద్ ,విశాల భారతి:**

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు స్థలాలను క్రమబద్ధీకరించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవి శివారులో జరిగిన గుడిసె వాసుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల తమ పాలనలో పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు మంజూరి చేయకపోవడం, విలువైన ప్రభుత్వ భూములను కొంతమంది అధికార పార్టీ నాయకుల అండదండలతో కాజేయడంతో వారి ఆగడాలను అరికట్టే పోరాటాలు నిర్వహిస్తూ, కమ్యూనిస్టు పార్టీలే ప్రభుత్వ స్థలాలను గుర్తించి అట్టి స్థలాలలో అర్హులైన పేదలతో గుడిసెలు వేయించడం జరిగినదని వాటిని నూతన ప్రజా ప్రభుత్వం గుర్తించి అర్హులైన పేదలకు స్థలాలను క్రమబద్ధీకరించి ఇందిర ఇండ్లు మంజూరి చేయించాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల సంక్షేమ పథకాల హామీలను అమలు చేసి పేదల ప్రజా ప్రభుత్వంగా ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న కన్నె వెంకన్న బుర్ర సమ్మయ్య తురక రమేష్ బూర్గుల కృష్ణ కొరియాల వీరన్న తదితరులు పాల్గొన్నారు.



# స్వాములకు నిత్య అన్నదానం

**సూర్యాపేట, విశాలభారతి:**

జిల్లా కేంద్రంలో శివమాల ధరించిన స్వాములు జిల్లా కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో శివదీక్ష స్వాముల నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి శివుడికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపిన అనంతరం శివ స్వాములకు తీర్థప్రసాదాలు అందజేసే అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి కోన ఎల్లయ్య మాట్లాడుతూ శివ దీక్ష చేపట్టే మాలధారణ స్వాముల కోసం ఈ నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నిత్య అన్నదానం శివరాత్రి వరకు కొనసాగుతుందని శివ మాల ధారణ స్వాములు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు మాలధారణ స్వాములు చింతల లింగరాజు, సురకంటి మధుసూదన్ రెడ్డి, రాజేష్, ఉపేందర్, సైదులు, రవితేజ తదితరులు ఉన్నారు.



# మహాజన సమితి మహిళ జిల్లా కార్యదర్శిగా కామాక్షి

**భద్రాచలం, విశాలభారతి:**

పట్టణానికి చెందిన పెద్ద పార్టీ కామాక్షిని మహాజన సమితి మహిళా జిల్లా కార్యదర్శిగా నియమిస్తున్నట్టుగా మహా జన సమితి ఆదివాసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రమణ కుమారి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రతి మహిళ చైతన్యవంతంగా ఆలోచించి మహిళలకు జరుగుతున్నటువంటి అన్యాయాలపైన అక్రమల పైన గొంతిత్తి నినదించే టందుకు మహా జన సమితి వేదిక కావాలని ప్రతి ఒక్క మహిళ మహాజన సమితి సంఘంలో మహిళా నాయకులను తయారు చేసేందుకు సిద్ధంగా ఉందని ఆమె అన్నారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా పెద్ద పార్టీ కామాక్షిని నియమిస్తున్నట్లు నియామక పత్రాన్ని అందించడం జరిగిందని ఆమె అన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి పెదపాటి కామాక్షి మాట్లాడుతూ నాకు ఈ బాధ్యతలు ఇచ్చిన కంగాల రమణకుమారికి అభినందనలు తెలిపారు మహిళా సమస్యల పైన నిరంతరం కొట్లాడుతానికి సిద్ధంగా ఉన్నానని మహిళలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడుతానని ఆమె అన్నారు ఈ పదవిని ఇచ్చేందుకు సహకరించిన మహాజన సమితి రాష్ట్ర జిల్లా నాయకులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.



# కాస్మోటిక్ ఛార్జ్ లు మార్చాలి

**ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్య ప్రకాష్.**

**మహబూబాబాద్, విశాలభారతి:**

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో, ప్రతి ఒక్క విద్యార్థి పోరాటంలో ముందుండాలి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో బాలికల ఆశ్రమ విద్యార్థినిలతో ఎస్ఎఫ్ఐ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం లో జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి,రాజేష్ లు పాల్గొన్నారు.



# క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**అడ్డగూడూరు, విశాలభారతి :**

ధర్మారం గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మరియు స్మశాన వాటికనే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధర్మారం యువకులతో క్రీడా ప్రాంగణంలో పాలు క్రీడలు ఆడి యువతను ఆకట్టుకున్న ఎమ్మెల్యే మందుల సామేలు ఈ కార్యక్రమంలో ధర్మారం సర్పంచ్ శీలం జ్యోతి రాములు గ్రామ శాఖ అధ్యక్షులు మత్యాస్ రెడ్డి వార్డు మెంబర్లు యువత మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నివాళులర్పించిన అంతటి పారిజాత నరసింహ

**చిట్యాల, విశాలభారతి:**

వెలిమినేడు గ్రామానికి చెందిన పంగ మల్లారెడ్డి అమ్మమ్మ వెల్ది ఈదమ్మ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా ఆదివారం నిర్వహించిన దశదిన కర్మలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అదేశానుసారం కాంగ్రెస్ నాయకులు అంతటి పారిజాత నరసింహ గౌడ్ ఈదమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి చిరగౌని శ్రీశైలం, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి,పాలసంఘం చైర్మన్ మారగౌనియాదయ్య,డైరెక్టర్ గడ్డం సత్తిరెడ్డి, దేశబోయిన బిక్షమయ్య,ఉంగరాల.పటేల్,బుచ్చిరెడ్డి,కాటం సత్తయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.



# వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

**నార్కట్ పల్లి, విశాలభారతి:**

మండల కేంద్రంలో ఉన్నటువంటి మానసిక వికలాంగులకు ఆసరా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్క యువత చురుగ్గా పాల్గోనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్కట్ పల్లి మండల కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, సంస్థ సభ్యులు గడగోజు ఎల్లాచారి,బోయిని మహేష్, చందు, రాజాశేఖర్, గిరిబాబు,లింగస్వామి పాల్గొన్నారు.



# వినతిపత్రం అందజేత

**తొర్రూర్ ,విశాలభారతి:**

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఎస్సీ ఎంపీ స్థానానికి పోటీచేయడానికి బీఆర్ఎస్ పార్టీ తరుపున తనకు అవకాశం కల్పించాలని కోరుతూ. మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆశీస్సులతో మహబూబాబాద్ మాజీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు సత్యవతి రాథోడ్, స్టేషన్ గన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మార్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం ఇవ్వగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.. మంగళపెల్లి ఆశయ్య గత 30 సంవత్సరాలుగా టీఆర్ఎస్ పార్టీ కోసం పని చేస్తూ 2001 సంవత్సరంలో ఎంపిటిసి గా పని చేశారు.. అప్పటినుండి ఇప్పటివరకు ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ కోసం కష్టపడుతూ పార్టీ వెన్నంటూ ఉంటూ 2012 సంవత్సరంలో తెలంగాణ ఉద్యమకారునిగా క్రియాశీలకంగా చురుకుగా పాల్గొంటూ ఉద్యమాలు జరిగినప్పుడు జైలుకు పోయి వచ్చాడు.. ప్రతి ఎన్నికల్లో అహర్నిశలు గా పార్టీ కోసం పనిచేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో వరంగల్ ఎస్సీ ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి టీఆర్ఎస్ పార్టీ తరపున నాకు అవకాశం కల్పించే విదంగా కృషి చేయాలి అని అన్నారు.



# గడ్డం సమ్మయ్యను సన్మానించిన మాజీ మంత్రి

**దేవరుప్పల, విశాలభారతి:**

అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు రావడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే నెమరుగమ్ముల సుధాకర్ రావు వారి ఇంటికి వెళ్లి పుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించి,పారితోషికాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషదాయకమని, అంతరించిపోతున్న గ్రామీణ కళలను ప్రోత్సహించవలసిన బాధ్యత మన అందరిపై ఉందని,రాబోవు తరాల వారికి గ్రామీణ కళలను తెలిపాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఏల సోమ సుందర్,కోతి ప్రవీణ్, చింత రవి,వంగ అర్జున్, గడ్డం రాజు ,యాదగిరి, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# క్లబ్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్ రెడ్డి

**గరిడేపల్లి, విశాలభారతి:**

లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల వారి ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ & బిపి పరీక్షల క్యాంప్ నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో ఉచిత డయాబెటిక్ & బిపి పరీక్షల క్యాంప్ కార్యక్రమాన్ని గరిడేపల్లి సర్పంచ్ త్రిపురం సీతారాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు అంజన్ రెడ్డి,పిఎసిఎస్ మాజీ చైర్మన్ బండ నర్సిరెడ్డి,క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ప్రజానీకానికి,నిరుపేదలకు ఉచితంగా బీపీ మరియు షుగర్ పరీక్షలు అందించడం క్లబ్ కి గర్వకారణమని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు సుంకర క్రాంతి కుమార్, పోరెడ్డి శ్రీరామ్ రెడ్డి ,క్లబ్ సభ్యులు లాయర్ విశ్వనాథం,కొణతం ఆదిరెడ్డి,శ్రీ సాయి డయాగ్నస్టిక్ సెంటర్ డైరెక్టర్ సాయి, సిగపట్ల లక్ష్మణ్,గుండు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య పరీక్షలు





## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సినీ ప్రముఖులు

సీఎంను కలిసిన తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిల్ రాజు, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కెఎల్ దామోదర ప్రసాద్, కౌన్సిల్ సెక్రెటరీ వైవీఎస్ చౌదరి, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ సునీల్ నారంగ్, సెక్రటరీ కె.అనుపమ రెడ్డి, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, సెక్రెటరీ పిఎస్ఎన్ దొర, ప్రొడ్యూసర్స్ గిల్డ్ ప్రెసిడెంట్ పీవీ రవి కిషోర్, ట్రెజరర్ బాపినీడు, సుప్రియ.

## హిమాలయాల్లో #గోపీచంద్32 లెంగ్తీ షెడ్యూల్



దర్శకుడు శ్రీను వైట్ల ప్రస్తుతం మాచో స్టార్ గోపీచంద్‌తో ఓ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను రూపొందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు ఇటలీలో ఒక షెడ్యూల్, మరొక షెడ్యూల్ గోవాలో పూర్తి చేశారు. ఈరోజు, గోపీచంద్, ఇతర ప్రముఖ తారాగణంతో హిమాలయాలలోని కొన్ని అద్భుతమైన ప్రదేశాలలో కీలకమైన, లెంగ్తీ షూటింగ్ షెడ్యూల్‌ను ప్రారంభించారు. ప్రముఖ డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ వేణు దోనేపూడి ఈ ప్రాజెక్ట్‌తో చిత్ర నిర్మాణంలోకి అడుగుపెడుతున్నారు. చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తన యాక్టర్స్ కు డిఫరెంట్ మేకోవర్లు ఇవ్వడంలో పేరుపొందిన శ్రీను వైట్ల గోపీచంద్‌ని సరికొత్తగా చూపిస్తున్నారు. ఇందులో యాక్షన్‌తో పాటు శ్రీనువైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది.

## దళపతి స్పీడ్ మెచ్చుకోవాల్సిందే..!



టాలీవుడ్ లో ఏ స్టార్ హీరోని తీసుకున్నా సినిమా మొదలు పెట్టారంటే కనీసం రెండేళ్లు తీసుకోనిదే రిలీజ్ చేయలేరు. అది పరిస్థితుల ప్రభావం కావొచ్చు.. సినిమా షూటింగ్ లేట్ కావొచ్చు.. కారణం ఏదైనా సినిమా ముహూర్తానికి రిలీజ్ డేట్ కి రెండేళ్లు తక్కువ గ్యాప్ లేకుండా చూసుకుంటారు. సినిమా బడ్జెట్ పెరిగేందుకు కారణమైన వాటిల్లో ఇది కూడా ఒకటి. అయితే మన వాళ్లు తీసేది పాన్ ఇండియా సినిమాలు కాబట్టి ఆ మాత్రం బడ్జెట్.. ఆ మాత్రం వెయిటింగ్ తప్పదని అనుకుంటారు. కానీ ఇక్కడ విషయం ఏంటంటే బడ్జెట్ ఎక్కువ పెట్టినా తక్కువ రోజుల్లో సినిమా పూర్తి చేస్తే కొంతలో కొంత సేవ్ చేసే అవకాశం ఉంటుంది. ఈ విషయంలో కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ ని తప్పకుండా మెచ్చుకోవాలి. ఎందుకంటే ఆయన సినిమాలు స్పీడ్ స్పీడ్ గా చేసేస్తాడు. వాటి కలెక్షన్స్ కూడా 200 కోట్లకు దాటేలా చేసుకుంటాడు. కోలీవుడ్ లో హ్యూజ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న దళపతి విజయ్ లాస్ట్ ఇయర్ లియో సినిమాతో వచ్చి హిట్ కొట్టాడు. ఇక ఆ వెంటనే వెంకట్ ప్రభు డైరెక్షన్ లో గోట్ అనౌన్స్ చేశాడు. సినిమా లాస్ట్ ఇయర్ ఎండింగ్ లో మొదలవగా సగానికి పైగా షూటింగ్ పూర్తైనట్టు తెలుస్తుంది. ఇక లేటెస్ట్ గా ఈ సినిమాను జూన్ లో రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారట. థ్రిల్ సినిమా సినిమాకు ఏమాత్రం గ్యాప్ లేకుండా.. సినిమా పూర్తి చేసేందుకు కూడా 8 నుంచి 10 నెలలు మాత్రమే పట్టేలా చూస్తున్నాడు విజయ్. సినిమా మొదలు పెడితే పూర్తి చేసేంతవరకు కృషి చేస్తుంటాడు. అయితే ఈ విషయంలో మన స్టార్స్ కూడా బెస్టే అని చెప్పొచ్చు. సినిమాకు ఎంత ఇవ్వాలో దానికి ఇంకా ఎక్కువే ఇచ్చేస్తుంటారు. సినిమా కోసం కష్టపడటంలో అందరు సమానమే కానీ సినిమాను త్వరగా పూర్తి చేయాలనే ఆలోచన కూడా ఉంటే బెటర్ అని చెప్పొచ్చు. Also Read RC 17 కాంబో.. డైనమిక్ డైరెక్టర్ సెట్టయినట్లే ఎవరెలా ఉన్నా దళపతి విజయ్ మాత్రం సినిమా మొదలు పెట్టామా ఆరు ఏడు నెలల్లో పూర్తి చేశామా రిలీజ్ చేశామా హిట్ కొట్టామా.. మళ్లీ వెంటనే సినిమా మొదలు పెట్టామా అన్న తీరులో సినిమాలు చేస్తున్నాడు. దళపతి విజయ్ లో ఉన్న ఈ ఒక్క స్పెషల్ క్వాలిటీ సినీ లవర్స్ ని ఆయన్ను ప్రత్యేకంగా అభిమానించేలా చేస్తుంది.



## మాస్ కా దాస్ విశ్వక్ సేన్ 'గామి' ఫస్ట్ లుక్ విడుదల

మాస్ క దాస్ విశ్వక్ సేన్ ప్రేక్షకులలో తనదైన ముద్ర వేసుకున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లు చేయడంతో పాటు యూనిక్ కాన్సెప్ట్‌లతోనూ ప్రయోగాలు చేస్తున్నారు. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో విశ్వక్ సేన్ చేస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'గామి'. కార్తీక్ కుల్ట్ క్రియేషన్స్‌పై కార్తీక్ శబరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ అడ్వెంచర్ డ్రామాని వి సెల్యులాయిడ్ సమర్పిస్తోంది. ఈ చిత్రానికి క్రౌడ్ ఫండ్ చేశారు. తాజాగా మేకర్స్ హైదరాబాద్ కామిక్ కాన్‌లో ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ ద్వారా ప్రమోషన్‌లను ప్రారంభించారు. అఘోరా గెటప్‌లో విశ్వక్ సేన్ ఆశ్చర్యపరిచారు. చుట్టూ చాలా మంది అఘోరాలు అతనిని తాకడానికి ప్రయత్నిస్తారు. పోస్టర్ టెర్రిఫిక్ గా వుంది. డార్క్ మిస్టీరియస్ ఫీలింగ్ ని కలిగిస్తోంది. ఆడియన్స్ లో చాలా క్యూరియాసిటీని క్రియేట్ చేస్తుంది. 'ఈ చిత్రంలో విశ్వక్ సేన్ 'శంకర్' అనే అఘోరాగా కనిపించనున్నారు. తనకి చాలా రేర్ కండీషన్ వుంటుంది. అతను ఏ మానవ స్పర్శను అనుభవించలేడు' అని మేకర్స్ అనౌన్స్ చేశారు. పోస్టర్‌పై "His biggest fear, is human touch... His deepest desire, is also human touch" అనే ట్యాగ్‌లైన్ వుంది. ఇది ఆ పాత్ర భావోద్వేగ సంఘర్షణ యొక్క లోతును తెలిజేస్తుంది. దర్శకుడు విద్యాధర్ మాట్లాడుతూ, "ఈ చిత్రంలో అఘోరా సెటప్‌తో పాటు, రెండు విభిన్నమైన సెటప్‌లు, ఇతర పాత్రలు ఉన్నాయి. ప్రమోషన్స్ లో వాటి గురించి రివిల్ చేస్తాం''అన్నారు

## కిస్మత్ అందరినీ అద్భుతంగా అలరిస్తుంది : ప్రీరిలీజ్ ఈవెంట్ లో కిస్మత్ టీం



నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వ దేవ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న బడ్డీ కామెడీ ఎంటర్ టైనర్ 'కిస్మత్'. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో పోషిస్తున్నారు. రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సిహెచ్ భానుప్రసాద్ రెడ్డి సహ నిర్మాత. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది.ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ నేపధ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ ని నిర్వహించింది. డైరెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ..కరోనా లాక్ డౌన్ సమయంలో నిర్మాత రాజు గారు పరిచయమయ్యారు. దాదాపు ఆరు నెలలు పాటు చాలా కష్టపడి ఈ కథని డెవలప్ చేశాం. కథ అద్భుతంగా వచ్చింది. మా నటీనటులు కూడా చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వ దేవ్ కి ధన్యవాదాలు. అలాగే శ్రీనివాస్ అవసరాల గారితో వర్క్ చేయడం మంచి అనుభూతి. విప్లవ్ చాలా చక్కగా ఎడిట్ చేశారు. మార్క్ కె రాబిన్ సాయి కార్తిక్ గారు అద్భుతమైన మ్యూజిక్ చేశారు. మా నటీనటులు, టెక్నికల్ టీం అందరికీ ధన్యవాదాలు. ఈ చిత్రం ప్రేక్షకులందరినీ ఎంటర్ టైన్ చేస్తుంది. తప్పకుండా థియేటర్స్ కి రండి చాలా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. శ్రీనివాస అవసరాల మాట్లాడుతూ.. శ్రీనాథ్ గారు నాకు చాలా నచ్చిన డైరెక్టర్ . చాలా క్లారిటీతో వుంటారు. ఆయనకి లాంగ్ కెరీర్ వుండాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నాను. నిర్మాత రాజు గారు చాలా కూల్ గా కాన్ఫిడెంట్ గా వుంటారు. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను. విప్లవ్ గారు అద్భుతంగా ఎడిట్ చేశారు. రాబిన్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వ దేవ్ సూపర్ యాక్టర్స్. వారితో నటించడం మంచి అనుభూతి. ఈ సినిమా అందరికీ మంచి పేరు తీసుకురావాలి' అని కోరారు.

## ఉత్సవం చిత్రం ఖచ్చితంగా సూపర్ డూపర్ హిట్ అవుతుంది




### బ్రహ్మ బ్రహ్మానందం

దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఇంపాక్ట్ ఫుల్ తెలుగు డ్రామా 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వం వహిస్తున్నారు. హార్నబిల్ పిక్చర్స్‌పై సురేష్ పాటిల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటివలే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు సినిమా టీజర్ ని లాంచ్ చేశారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం అతిధులుగా హాజరైన ఈ టీజర్ లాంచ్ వేడుక గ్రాండ్ గా జరిగింది. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హాస్య బ్రహ్మ బ్రహ్మానందం మాట్లాడుతూ.. నటులు, నట జీవితం అంటే నాకు ఒక ఎమోషనల్ ఎటాచ్మెంట్. ఆర్ట్ ఈజ్ లాంగ్.. లైఫ్ ఈజ్ షార్ట్. చివరి వరకూ మిగిలిపోయేది కళ మాత్రమే. కళా కారులందరినీ ఒక్క చోటికి చేర్చి వీరిపై ఒక సినిమా చేయాలని ఆలోచన చేసిన దర్శకుడు అర్జున్ సాయికి మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇలాంటి సినిమాలు ఎన్నుకోవాలంటే ధైర్యంతో పాటు సినిమాటిక్ గా చెప్పే నేర్పు కావాలి. ఇంతమంది నటీనటులని ఒక్క చోటికి చేర్చి చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. అందరూ అద్భుతమైన నటన ప్రదర్శించారు. నిజంగా ఈ సినిమా 'ఉత్సవం'లా వుంటుంది. ఖచ్చితంగా సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుంది. విభిన్నమైన కథలని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. కళకు ఆయువుపట్టు నాటకరంగం. తప్పకుండా ఈ చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాను. హీరో దిలీప్ చక్కని నటన కనపరిచాడు. రంగస్థలం గురించి, ఈ సినియా గురించి దర్శకుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకొని 'ఉత్సవం' తీర్చిదిద్దారు. తప్పకుండా ఈ చిత్రం అందరినీ అలరిస్తుంది'' అన్నారు. నిర్మాత ఏఎం రత్నం మాట్లాడుతూ.. సినిమాకి మూలమే నాటకరంగం. ఈ టీజర్ లోని మొదటి డైలాగే చాలా ఆకట్టుకునేలా వుంది. ఇంతమంది లెజెండరీ నటులతో ఈ చిత్రాన్ని రూపొందించడం చాలా విశేషం. ఇంత మంచి కళాత్మక చిత్రానికి దర్శకత్వం వహించిన అర్జున్ సాయి కి అభినందనలు. ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

## బహుముఖం ఫస్ట్ లుక్ విడుదల



టాలీవుడ్‌లోని న్యూ ఏజ్ ఫిల్మ్ మేకర్స్ డిఫరెంట్ జోనర్స్ ఫిల్మ్ మేకింగ్‌లతో ప్రయోగాలు చేస్తున్నారు. తెలుగు సినిమాలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమౌతున్నారు ట్యాలెంటెడ్ హర్షివ్ కార్తీక్. ఆసక్తికరమైన విషయంఏమిటంటే, తను ప్రధాన పాత్ర పోషించడంతో పాటు రచన, నిర్మాణం, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి 'బహుముఖం' అనే టైటిల్ పెట్టారు. గుడ్, బ్యాడ్ & యాక్టర్ అనేది ట్యాగ్‌లైన్. ఈ సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్ అట్లాంటా, మాకాన్, కాంటన్, జార్జియా, యుఎస్ఏ పరిసర ప్రాంతాలలో చిత్రీకరించబడింది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో హర్షివ్ కార్తీక్ కాంప్లెక్స్ క్యారెక్టర్ కనిపిస్తున్నారు. ముఖంలో ఒక వైపు నుదుటిపై విభూతితో నీలం రంగు వేయబడి ఉండగా, మరొక వైపు అతనిని స్టైలిష్ అవతార్‌లో చూపిస్తుంది. కంటి నుండి కన్నీళ్లు కారుతుంటే, మరోవైపు ఆనందం కనిపిస్తోంది. అతని చేతులు లాక్ చేయబడ్డాయి. ఈ పోస్టర్ పాత్ర యొక్క విలక్షణ స్వభావాన్ని చూపిస్తుంది.



## తగ్గేదేలే అంటున్న ప్రగ్యా

ప్రగ్యా జైస్వాల్ సోషల్ మీడియాల్లో విపరీతమైన ఫాలోయింగ్‌ను ఆస్వాధిస్తున్న నటి కం మోడల్. ఈ బ్యూటీ తరచుగా వేడెక్కించే ఫోటోలు, వీడియోల తో ఇంటర్నెట్‌లో అగ్గి రాజేస్తోంది. ఈ రోజు ప్రగ్యా తన అందచందాలను ప్రదర్శించే వీడియోతో చెలరేగింది. ఇది కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై అభిమానులు ఘాటైన వ్యాఖ్యలు కురిపిస్తున్నారు. ప్రగ్య తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో షేర్ చేసిన వీడియోలో బ్లాక్ అండ్ బ్లాక్ లుక్ లో కనిపించింది. అందాలను ఆరాంగా టూమచ్ గా చూపించడంలో తనని కొట్టేవాళ్లే లేరని నిరూపిస్తోంది. ఈ వీడియోను షేర్ చేసిన వెంటనే, అభిమానులు కామెంట్ సెక్షన్‌లో హార్ట్ ఎమోజీలతో చెలరేగారు. ప్రగ్య టూ హాట్ గా ఉందంటూ పొగిడేసారు. బ్లాక్ ఇన్నర్ ధరించిన ప్రగ్య పైన బ్లాక్ లెదర్ కోట్, బాటమ్ వేర్ ని ధరించి తనలోని హొయలను ప్రదర్శించింది. ఇటీవల ఇన్ స్టాలో ప్రగ్య ఇదే తీరుగా వరుస ఫోటోషూట్లతో చెలరేగుతోంది. ఇంతకుముందు ఎరుపు రంగు బికినీలో అలరించిన ఈ బ్యూటీ న్యూడ్ మేకప్ స్టేట్‌మెంట్ నెక్లెస్ సెట్‌తో గుబులు రేపింది. కొన్ని రోజుల క్రితం ప్రగ్య లండన్ వెకేషన్ నుండి కొన్ని ఫోటోలను షేర్ చేసింది. అక్కడ ఎర్రటి హై-నెక్ స్వెటర్‌లో కనిపించింది. సూర్యుడు నేను లండన్‌లో ఒకే సమయంలో అడుగుపెట్టిన అరుదైన సందర్భం అని ప్రగ్య టీజ్ చేసింది. అప్పుడు ఆ వీడియో వైరల్ అయింది. అఘోరా థ్రిల్ ప్రగ్యా 2014లో ద్విభాషా థ్రిల్లర్ చిత్రం విరాట్టుతో తొలిసారిగా నటించింది. కానీ 2015 పీరియడ్ డ్రామా కంచెలో కనిపించిన తర్వాత నటిగా పురోగతిని పొందింది. ఈ రొమాంటిక్ వార్ డ్రామా చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహించారు. వరుణ్ తేజ్ ఇందులో కథానాయకుడు. ఈ చిత్రం డీసెంట్ విజయాన్ని సాధించింది. ప్రగ్యా ఉత్తమ మహిళా డెబ్యూ సౌత్‌గా ఫిల్మ్‌ఫేర్ అవార్డును కూడా అందుకుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.